సాక్షి తిరుపతి

బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



ఆవిష్కరణల వేదికగా..

తిరుపతి ఐఐటీ, ఐజర్ శాశ్వత క్యాంపస్ భవనాలను ప్రధానమంత్రి వర్చువల్‌గా మంగళవారం ప్రారంభించారు. - 8లో



పేదరిక నిర్మూలనకే 'సంక్షేమం'

పేదరికం నిర్మూలనకే ముఖ్యమంత్రి జగనన్న పథకాలు అమలు చేస్తున్నట్లు డిప్యూటీ మేయర్ తెలిపారు. - 8లో



జగనన్న వెంటే జనం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

వ్యవసాయశాఖ సేవల్లో జిల్లా ఫస్ట్



ప్రసాద్‌రావు, డీఏఓ

తిరుపతి అర్బన్ : రైతులకు విశేష సేవలందిస్తూ జిల్లా వ్యవసాయశాఖ రాష్ట్రంలో మొదటి స్థానం దక్కించుకుంది. మంగళవారం ఈ మేరకు వ్యవసాయశాఖ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ ప్రకటించారు. సీహెచ్‌సీ గ్రూపుల పురోగతి, రబీలో ఎరువుల సరఫరా, పొలంబడి, కియోస్క్‌ల పనితీరు, ఖరీఫ్‌లో ఈకేవైసీ నమోదును 100 శాతం పూర్తిచేసినందుకు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని వెల్లడించారు. ఈ క్రమంలోనే జిల్లా వ్యవసాయ శాఖాధికారి (డీఏఓ) ఎస్.ప్రసాద్‌రావును ఉత్తమ అధికారిగా రైతుభరోసా పుస్తకంలో చోటు దక్కించుకున్నారని వివరించారు. ప్రతి నెలా ప్రకటించే ఈ పురస్కారాల్లో గత ఏడాది ఆరు పర్యాయాలు జిల్లానే తొలిస్థానంలో నిలవడం విశేషం. దీనిపై జిల్లా వ్యవసాయశాఖ ఉద్యోగులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. డీఏఓ మాట్లాడుతూ సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ స్ఫూర్తితోనే జిల్లాను ముందు వరుసలో కొనసాగేలా చిత్తశుద్ధితో విధులు నిర్వర్తిస్తామని తెలిపారు. అన్నదాతలకు అన్నివిధాలుగా అండగా ఉంటూ ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తామని వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 64,741 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,667 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.82 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

23న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి సిటీ : ఎస్వీయూలోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఈ నెల 23వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 5 ప్రముఖ జాతీయ కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాలో పాల్గొని 850 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. మంచి ప్యాకేజీతో వేతనాలు ఉంటాయని ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఎస్వీయూలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పాలిసెట్‌కు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి ఏటా నిర్వహించే పాలిసెట్‌కు ఏప్రిల్ 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్, పాలిసెట్ కన్వీనర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 27వ తేదీ ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాష్ట్ర వ్యాప్తంగా పాలిసెట్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల విద్యార్థులు నిర్ణీత గడువులోపు పీఓఎల్‌వైసీఈటీఏపీ.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదు



కోళ్ల ఫారం తనిఖీ చేస్తున్న రవికుమార్

తిరుపతి అర్బన్ : జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ లేదని, ప్రజలు నిశ్చింతగా చికెన్, గుడ్లు భుజించవచ్చని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి రవి కుమార్ వెల్లడించారు. మంగళవారం తమ సిబ్బందితో కలసి రామచంద్రాపురం, తిరుపతి రూరల్, రేణిగుంట, పుత్తూరు మండలాల్లోని 18 పౌల్ట్రీఫామ్‌లను తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని స్పష్టం చేశారు. అయినప్పటికీ జిల్లాలో 85 పశువైద్య బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. పౌల్ట్రీ రైతులకు బర్డ్ ఫ్లూపై అవగాహన కల్పించామని చెప్పారు.

మఠం భూముల్లో కట్టడాలు తొలగిస్తాం

తిరుపతి కల్చరల్ : తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట పరిధిలోని స్వామి హథీరాంజీ మఠం భూములను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను పూర్తి స్థాయిలో తొలగిస్తామని మఠం డిప్యూటీ కలెక్టర్, ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మఠం భూములను కొందరు ఆక్రమించి అమ్మేస్తున్నారని మండిపడ్డారు. వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఇది కదా.. అభివృద్ధి

రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు బతుకులు .. ఏళ్ల తరబడి మగ్గం నేస్తూ వెన్ను కుంగిన జీవితాలు.. రాత్రింబవళ్లు పనిచేసినా నోట్లోకి నాలుగు వేళ్లు వెళ్లలేని పరిస్థితులు. దిక్కు తోచక కొట్టుమిట్టాడుతున్న నేత కార్మికుల్లో 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అనే మాట ఎనలేని ధైర్యం నింపింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన 'వైఎస్సార్ నేతన్న నేస్తం'.. ఛిద్రమైన చేనేత పరిశ్రమలోకి సంక్షేమ వెలుగులు తీసుకువచ్చింది. ఈ పథకం కింద ప్రభుత్వం ఏటా రూ.24వేలు అందిస్తూ వారి జీవన ప్రమాణాలు.. స్థితిగతులను గణనీయంగా మెరుగుపరిచింది.



వెంకటగిరిలో చేనేత కార్మికుడితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

- కుదేలైన చేనేత బతుకుల్లో సంక్షేమ వెలుగులు
- 'వైఎస్సార్ నేతన్న నేస్తం'తో మారిన తల రాతలు
- ప్రభుత్వం చేయూతతో తీరిన సమస్యలు
- రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్న నేత కార్మికులు
- ఆర్థికంగా పుంజుకున్న బడుగు జీవితాలు

నేనున్నాను నేస్తం

సాక్షి, తిరుపతి డెస్క్ : నేత కార్మికులు ఇంటిల్లిపాదీ పనిచేసినా షావుకారుల వద్ద తెచ్చుకున్న ముడి సరుకులు, కుటుంబ అవసరాలకు సరిపోయేది కాదు. చేనేత రంగంలో ఆధునికతను అందిపుచ్చుకోలేక.. మగ్గాలను వదిలి వేరే వృత్తి చేసుకోలేక వారి జీవితం దుర్భరంగా ఉండేది. ఈక్రమంలో చేనేతల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం రూపొందించారు. నెలకు రూ.2 వేలు చొప్పున సంవత్సరానికి రూ.24వేలు అందించాలని నిర్ణయించారు. ఆ మొత్తాన్ని ఒకేసారి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చారు. ఈ ఆర్థిక సాయం నేతన్నలకు ఎంతగానో ప్రోత్సాహం అందించింది. అరకొర ఆదాయంతో జీవించే కార్మికులకు నేతన్ననేస్తం నగదు ఆపద్బంధువులా పనిచేసింది. ఈ సొమ్ముతో చేనేత కార్మికులు తమ మగ్గాలను ఆధునీకరించుకోవడం, మిషన్‌లను అమర్చి పనులు వేగవంతం చేసే దిశగా అడుగులు ముందుకు వేశారు. విద్యుత్ మోటార్ల సహాయంతో సులువైన రీతిలో త్వరగా పనులు పూర్తి చేసుకుంటూ రాణిస్తున్నారు. మరి కొందరు కార్మికులు సొంతంగా పడుగు, పేకా, జరీ కొనుగోలు చేసుకుని తాము నేసిన చీరలను మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకునే పరిస్థితికి ఎదిగారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తమ బతుకులు మెరుగుపడ్డాయని పలువురు చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి జిల్లా సమాచారం

నేత కార్మికులు	15,475
సొంత మగ్గాలు ఉన్న వారు	4,250
చేనేత సొసైటీలు	42
చేనేత వృద్ధాప్య పింఛన్‌దారులు	5,771

వైఎస్సార్ నేతన్న నేస్తం తిరుపతి జిల్లా లబ్ధిదారులు

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	అందించిన సాయం (రూ.కోట్లలో)
2019-20	3,822	9.17
2020-21	3,572	8.81
2021-22	3,125	7.50
2022-23	3,171	7.51
2023-24	3,447	8.28

మేలు జరిగింది



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంలో వచ్చిన ఆర్థిక సాయంతో వృత్తిని మెరుగుపరచుకున్నా. చాలీ చాలని ఆదాయంతో సతమతమయ్యే సమయంలో ఈ పథకం ఎంతో ఉపయోగపడింది. గతంలో ఐదు విడతల్లో రూ.1.20 లక్షలు నాకు అందింది. ఈ సాయంతో లిఫ్టింగ్ యంత్రం కొనుగోలు చేసుకున్నా. ఇదివరకు పట్టు చీర నేయడానికి 5 రోజులు పట్టేది. ప్రస్తుతం 3 రోజుల్లో చీర నేయడం పూర్తవుతోంది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో నాకు ఎంతో మేలు జరిగింది. పేదలకు అండగా నిలుస్తున్న జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. **– మోహన్, చేనేత కార్మికుడు, మాంగాడు, నగరి మండలం**

నిలదొక్కుకున్నా



ఎలాంటి సిఫారసులు లేకుండా అర్హతే ఆధారంగా నాకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం అందుతోంది. నూలు తెచ్చుకోలేని దుస్థితిలో ఉన్న రోజుల్లో ఈ పథకం నన్ను ఆదుకుంది. ప్రస్తుతం ఐదు విడతల్లో వచ్చిన ఆర్థిక సాయంతో వృత్తిలో నిలదొక్కుకున్నా. పెద్దసంఖ్యలో డిజైన్లు ఇచ్చే పనిముట్లు, బాబిన్లు కొనుగోలు చేసుకున్నా. కొత్త డిజైన్లతో ఖర్చీఫ్‌లు నేస్తున్నా. ఫెడల్ లూమ్ కోసం దరఖాస్తు చేసుకున్నా. మా కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి అంటే అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కారణం. **– పి. కస్తూరి, నేత కార్మికురాలు, మాంగాడు, నగరి మండలం**

ముడి సరుకులు తెచ్చుకుంటున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఏటా రూ. 24వేలు మా ఖాతాల్లో జమ చేస్తున్నారు. నేతన్న నేస్తం కింద అందిన నగదుతో మగ్గాలకు కావాల్సిన పట్టు, జరి, నూలు వంటివి ముడి సరుకులు తెచ్చుకుంటున్నాం. గత 35 ఏళ్ల నుంచి ఇదే వృత్తిలో కొనసాగుతున్నాం. ఎప్పుడూ ఏ ప్రభుత్వం చేయలేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాలాంటి నేత కార్మికులకు సాయం అందిస్తోంది. జగనన్న తోడ్పాటుతోనే మా బిడ్డలను ఉన్నతంగా చదివించుకోగలుగుతున్నాం. **– బొడిచెర్ల హైమావతి, చేనేత కార్మికురాలు, ఎన్టీఆర్‌కాలనీ, వెంకటగిరి**

బతుకులు మారాయి



గతంలో మా తాత, తండ్రి కాలం నుంచి చేనేత మగ్గాలనే జీవనాధారం చేసుకుని పొట్టపోసుకుంటున్నాం. గతంలో చేనేతలను ఎవరూ ఆదుకున్న దాఖలాలు లేవు. షావుకారుల వద్ద నుంచి ముడి సరుకులు తెచ్చుకోవడమే కాకుండా, చీర నేసే సమయంలో పడుగు, పేకా తగ్గితే సొంత నగదు వెచ్చించి చీరను పూర్తిచేసేవాళ్లం. షావుకారు ఇచ్చే కూలి సరిపోక కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేనేతలకు ఏటా రూ. 24వేలు నగదు వేయడంతోపాటు మరింత ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. దీంతో మా బతుకులు మారాయి. ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తున్నాం. **– బొడిచెర్ల సుబ్బయ్య, చేనేత కార్మికుడు, ఎన్టీఆర్‌కాలనీ, వెంకటగిరి**

విప్లవాత్మకమైన మార్పులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ నేతన్న నేస్తం చేనేత పథకం ద్వారా సకాలంలో నిధులు ఖాతాల్లోకి వస్తుండడంతో చేనేత పరిశ్రమలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. చాలా మంది నేత కార్మికులు ఈ నిధులు సద్వినియోగం చేసుకొని సొంతంగా మగ్గాలు నేసుకుంటూ రాణిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో చేనేత వస్త్రాలకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో వ్యాపారాలు కూడా జోరుగా సాగుతున్నాయి. దీంతో చేనేతల జీవితాలు గతంలో కంటే ప్రస్తుతం మెరుగ్గా ఉంటున్నాయి. మాలాంటి పేదల బతుకులకు సాయం చేస్తున్న జగనన్న మేలును జీవితంలో మరువలేం. **– చీకవోలు సుధాకర్, నేత కార్మికుడు, సాలికాలనీ వెంకటగిరి**

ఆదుకుంటోంది



నేతన్ననేస్తం పథకం ఆపద్బంధువులా సకాలంలో ఆదుకుంటోంది. గతంలో నేత పనులు సాగితేనే జీవనధారం ఉండేది. అదీ షావుకారు ఇచ్చే అరకొరా కూలి డబ్బులతో ఓ పూట తింటూ.. మరో పూట పస్తుండాల్సిన పరిస్థితి. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా అందిస్తున్న రూ.24వేలతో మా పరిస్థితి మెరుగుపడింది. వర్షాలు కురిసే సమయంలో ఒకప్పుడు పనులు సాగేవి కావు. అప్పుడు కుటుంబ పోషణ కూడా కష్టంగా ఉండేది. ప్రభుత్వం అందిస్తున్న భరోసాతో మాకు ఇబ్బందులు తప్పాయి. **– జింగా వెంకటలక్ష్మి, చేనేత కార్మికురాలు, సాలి కాలనీ, వెంకటగిరి**

అండగా నిలుస్తోంది



గతంలో ఏ ప్రభు త్వం ఇవ్వలేనంత భరోసాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నారు. పూట గడిచేందుకే కష్టమైన కోవిడ్ సమయంలో సైతం ప్రభుత్వం సాయం అందించింది. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ అండగా నిలుస్తోంది. మాకు నేతన్ననేస్తం పథకమేకాకుండా అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ వంటి ఎన్నో పథకాల ద్వారా లబ్ధి చేకూర్చింది. రెక్కాడితే కానీ డొక్కాడని మాలాంటి పేదలకు ఇంతగా చేయూతనందిస్తున్న జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. **– పింజల వీరయ్య, చేనేత కార్మికుడు, బంగారుపేట, వెంకటగిరి**

యంత్రాలు అమర్చుకున్నా



నేతన్న నేస్తం నిధులను ప్రభుత్వం సకాలంలో అందించడంతో మా మగ్గానికి సులభతరంగా పనులు సాగే దిశగా యంత్రాలను అమర్చుకున్నా. గతంలో నేత పనుల కంటే ఈ యంత్రాల సహాయంతో పనులు సాఫీగా సాగిపోవడంతో పాటు తక్కువ సమయంలో అనుకున్న లక్ష్యాలను చేరుకుంటున్నాం. దీంతో కొంత ఆర్థిక ఉపశమనం లభించింది. ఈ స్థాయిలో ఏ ప్రభుత్వమూ చేనేత కార్మికులను ఆదుకోలేదు. ఏటా అందిస్తున్న రూ.24వేల నగదు మాకు ఎంతో విలువైంది. మాట ప్రకారం అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి మేలు ఎన్నటికీ మరువలేం. **– పసుమర్తి రవి, చేనేత కార్మికుడు, బంగారుపేట**

సీఎం పర్యటనను విజయవంతం చేయండి





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సభా స్థలం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి, నాయకులు

- సమన్వయంతో పనిచేద్దాం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

శాంతిపురం: కుప్పంలో ఈ నెల 26న జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన చిత్తూరు కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జాషువా, ఎమ్మెల్సీ భరత్, సీఎం పర్యటనల సలహాదారు తలశిల రఘురామ్‌తో కలిసి రామకుప్పం, శాంతిపురం మండలాల్లో సీఎం పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. రామకుప్పం మండలం రాజుపేట వద్ద హెలీప్యాడ్, కుప్పం కెనాల్ కాలువను పరిశీలించారు. శాంతిపురం మండలంలోని మఠం వద్ద హెలీప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడే మంత్రి మీడియాతో మాట్లాడుతూ కుప్పం కెనాల్ పనులు కొంత ఆలస్యం కావడం, వేసవి రావడంతో ఇబ్బందిగా ఉన్నా నీరు తెస్తున్నామన్నారు. 14 ఏళ్లు సీఎంగా నీరు తేలేక పోయిన చంద్రబాబు, ఆయన పార్టీ ఇప్పుడు విమర్శలు చేస్తున్నారని చెప్పారు. కుప్పంలో ఇప్పటికే రెండు చోట్ల రాజన్న క్యాంటీన్ ద్వారా నిత్యం వేల మందికి ఉదయం, మధ్యాహ్నం భోజనం పెడుతున్నామన్నారు.

నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

కుప్పం ప్రాంత ప్రజలు తరచూ ఎదుర్కొంటున్న నీటి కష్టాలకు హంద్రీనీవా కాలువ నీటితో శాశ్వత పరిష్కారం దొరుకుతుందని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. శాంతిపురంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ 35 ఏళ్లుగా కుప్పానికి ప్రాతినిథ్యం వహిస్తున్న చంద్రబాబు చేయలేని పనిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో పూర్తి చేశారని చెప్పారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన బాబు సొంత నియోజకవర్గానికి కూడా నీరు ఇవ్వలేక పోయారన్నారు. గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తీసుకువచ్చే పనులు 70 శాతానికి పైగా పూర్తయ్యాయన్నారు. అది పూర్తయితే కుప్పానికి నదీ జలాలు తీసుకురావడం మరింత సులువుగా మారుతుందని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న కాలువ పనులు, ఎత్తి పోతల యూనిట్లు పూర్తి చేసి, కర్నూలు నుంచి నీటిని తెస్తున్నామన్నారు. కానీ ఈనాడు పత్రిక మాత్రం నీరు తేవడానికి ఆపసోపాలు పడుతున్నారని, నీరు రావడం లేదని రాసిందన్నారు. మీడియా వాస్తవాలను చూసి, వాస్తవాలనే చెప్పాలని కోరారు. కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రంతో పాటు 56 చెరువులకు నేరుగా కాలువ ద్వారా నీటిని విడుదల చేయడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రామకుప్పం మండలం రాజుపేట, లేదా శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె వద్ద హంద్రీనీవా నీటికి పూజలు చేసి, విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్ పీడీలు రాజశేఖర్, తులసి, పద్మనాభం, హంద్రీనీవా ఎస్ఈ రాజగోపాల్, పార్టీ కన్వీనర్లు బుల్లెట్ దండపాణి, బాబురెడ్డి పాల్గొన్నారు.

చిన్నారికి 'భూమన' ఆశీస్సులు



చిన్నారి, తల్లిదండ్రులను అభినందిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన

తిరుపతి మంగళం: నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ (పండ్లు, కూరగాయలు గుర్తించడం) స్థానం సంపాదించిన చిన్నారి ప్రజ్ఞారాయల్‌ను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి , డిప్యూటి మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఆత్మీయంగా గుండెలకు హత్తుకుని ముద్దాడి ఆశీర్వదించారు. మంగళవారం తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో చిన్నారి తల్లిదండ్రులు యోగేష్, జ్యోతిర్మయిని వారు అభినందించారు. చిన్నారిని ఇదే తరహాలో ప్రోత్సహిస్తూ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలని సూచించారు. ప్రజ్ఞారాయల్ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

పేదల అభ్యున్నతికే పథకాలు



మెగా చెక్ అందిస్తున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, కలెక్టర్ లక్ష్మీ శ

- వైఎస్సార్ కల్యాణమస్తు.. షాదీతోఫా నిధుల విడుదల
- ఐదో విడతలో 433 మందికి రూ.3.61 కోట్ల లబ్ధి

తిరుపతి అర్బన్ : పేదల అభ్యున్నతికే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష తెలిపారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనారిటీలు, దివ్యాంగుల కుటుంబాల్లోని ఆడ పిల్లల వివాహానికి సంబంధించి వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాల కింద ఐదో విడత నిధులు విడుదల చేశారు. కలెక్టరేట్ నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మె ల్సీ, మేయర్ మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తోందన్నారు. ఎవరైనా అర్హులకు పథకాలు అందకుంటే ఆయా సచివాలయాల్లో అర్జీ ద్వారా తెలియజేయాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా 433 మంది లబ్ధిదారులకు రూ.3.16 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 2,035 మందికి రూ.16.86 కోట్ల లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, సాంఘిక సంక్షేమ శాఖాధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ అభివృద్ధికి కృషి


ఎంపీ గురుమూర్తిని సత్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎంపీ గురుమూర్తి తెలిపారు. మంగళవారం మహిళా వర్సిటీలోని ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో వర్చువల్‌గా ప్రధానమంత్రి మోదీ ప్రారంభించిన ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధి కోసం సకాలంలో కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించడంలో అధికారులు కృషి అభినందనీయమన్నారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి కల్పన, స్కిల్ డెవలప్‌మెంట్. పరిశోధనల్లో వర్సిటీ ముందుంటుందని, అందుకే కేంద్రం నిధులను మంజూరు చేసిందని వివరించారు. వీసీ భారతి మాట్లాడుతూ వర్సిటీలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ సమష్టిగా కష్టపడుతున్నారని, అందరి శ్రమతోనే రూ.వంద కోట్ల నిధులు సాధించగలిగామన్నారు. ప్రాజెక్టులను సాధించడంలో ఎంపీ గురుమూర్తి సహకారం మరువలేనిదని కొనియాడారు. అనంతరం జమ్ము నుంచి ప్రధాని మోదీ పీఎం యూఎస్‌హెచ్‌ఏ పథకాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించి మహిళా వర్సిటీకి రూ.100కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ దేశంలో ఉన్నత విద్యా సంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ఎంపిక చేయబడిన యూనివర్సిటీలకు నిధులు మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం ఎంపీని వర్సిటీ అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, అధ్యాపకులు కాత్యాయిని, సుజాత, ఉమ పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు వేదికగా ఐఐటీ..ఐజర్


ఐజర్ ప్రాంగణం, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి


ఐఐటీలో ఎంపీ గురుమూర్తి, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ సిబ్బంది

- జాతీయ విద్యాసంస్థల శాశ్వత క్యాంపస్‌లు ప్రారంభం
- వర్చువల్‌గా జాతికి అంకితమిచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ
- ముఖ్యఅతిథులుగా హాజరైన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ గురుమూర్తి

రేణిగుంట/ఏర్పేడు : ఆవిష్కరణలకు వేదికగా జాతీయ అత్యున్నత విద్యాసంస్థలైన తిరుపతి ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ), ఐజర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ రీసెర్చ్) విశిష్ట సేవలందించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచించారు. ఆయా విద్యాసంస్థల్లో శాశ్వత క్యాంపస్ పూర్తిస్థాయిలో నిర్మాణాలను పూర్తి చేసుకోవడంతో మంగళవారం వర్చువల్‌గా ప్రధానమంత్రి ప్రారంభించి జాతికి అంకితమిచ్చారు. 548.11 ఎకరాల సువిశాల ప్రాంగణంలో రూ.867.49 కోట్ల వ్యయంతో ఐఐటీ క్యాంపస్ రూపుదిద్దుకుంది. అధునాతన టెక్నాలజీకి అనుగుణంగా అద్భుత హంగులతో నిర్మించారు. 3వ జనరేషన్ ఐఐటీగా గుర్తింపు పొందిన ఈ జాతీయ విద్యాసంస్థ 2020లో శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులను ప్రారంభించి నాలుగేళ్లలోపు పూర్తి చేశారు. ఐజర్‌కు 255 ఎకరాల్లో రూ.2,117 కోట్ల వ్యయంతో అత్యాధునిక క్యాంపస్ నిర్మించారు. 1,500 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు.

విద్యారంగంలో నూతన సంస్కరణలు


ఐఐటీలో సభకు హాజరైన సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు

ఐఐటీ క్యాంపస్‌ను జాతికి అంకితమిచ్చే వేడుకలో ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో నూతన సంస్కరణలు చేపట్టినట్లు వివరించారు. ప్రపంచస్థాయి విద్యను అందించాలనే గొప్ప లక్ష్యంతో ఐబీఎం, ఎడ్-ఎక్స్ వంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. ఐఐటీ వంటి గొప్ప విద్యాలయాల్లో అభ్యసించాలని ప్రతి ఒక్క విద్యార్థికి ఉంటుందని, అయితే అత్యుత్తమ ప్రతిభను కనబరచిన వారే ఇక్కడ ప్రవేశం పొందుతారని వెల్లడించారు. ఐఐటీ క్యాంపస్‌ను అత్యద్భుతంగా తీర్చిదిద్దడంలో కృషి చేసిన ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ, సిబ్బందిని అభినందించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ దేశ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడంలో యువత కీలకంగా మారాలని కోరారు. రాష్ట్రంలో ఒకేసారి మూడు జాతీయ విద్యాసంస్థలను జాతికి అంకితమిచ్చే మహత్తర కార్యక్రమాన్ని భారత ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా జరుపుకోవడం అరుదైన ఘట్టమన్నారు. ఐజర్, ఐఐటీలకు రాష్ట్రప్రభుత్వం పూర్తిస్థాయి సహాయ, సహకారాలు అందిస్తుందని తెలిపారు. కలెక్టర్ లక్ష్మీ శ మాట్లాడుతూ విద్యార్థులు మరిన్ని ఆవిష్కరణలను తీసుకొచ్చి విజ్ఞాన జ్యోతులను వెలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కేఎస్ సత్యనారాయణ, ఐజర్ డైరెక్టర్ ఎస్.భట్టాచార్య, ఐజర్ రిజిస్ట్రార్ ఇన్‌చార్జి విజయమోహన్ పిళ్లై, చీఫ్ ఇంజినీర్ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పవిత్రం.. విష్ణుసహస్రనామ పారాయణం


పారాయణం చేస్తున్న పండితులు

తిరుమల: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని లోకకల్యాణం కోసం తిరుమల నాదనీరాజనం వేదికపై మంగళవారం ఉదయం టీటీడీ చేపట్టిన విష్ణుసహస్రనామ స్తోత్ర అఖండ పారాయణం భక్తిభావాన్ని పంచింది. ఈ సందర్భంగా తిరుమల వేద విజ్ఞాన పీఠం ఆచార్యులు శ్రీమాన్ కోగంటి రామానుజాచార్యులు, మారుతి, అనంతగోపాలకృష్ణ అఖండ పారాయణం చేశారు. మొదట గురు ప్రార్థనతో సంకల్పం చెప్పారు. ఆ తరువాత విష్ణు సహస్రనామ స్తోత్రం 108 శ్లోకాలను మూడుసార్లు పారాయణం చేశారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారిణి కవిత బృందం ×అని యానతిచ్చె కృష్ణుడర్జునునితో×.. తదితర కీర్తనలను చక్కగా ఆలపించారు. కార్యక్రమంలో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, పాల్గొన్నారు.

బ్యాంక్ మేనేజర్‌పై దాడి

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని కెనెరా బ్యాంకు మేనేజర్ తుపాకుల మురగయ్యపై సోమవారం రాత్రి శ్రీనివాసులు అనే వ్యక్తి దాడి చేసినట్లు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. వివరాలు.. బ్యాంక్ మేనేజర్ మురగయ్య బైక్ వస్తుండగా పట్టణంలోని దర్గా సమీపంలో మరో బైక్‌లో వస్తున్న శ్రీనివాసులు ఢీకొన్నాడు. ఈ విషయమై అడిగినందుకు మేనేజర్‌పై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

బెటాలియన్ ఆర్‌ఎస్‌ఐ ఇంట్లో చోరీ

– 52 గ్రాముల బంగారం అపహరణ

నాయుడుపేట టౌన్: పట్టణంలోని తుమ్మూరులో నివసిస్తున్న వెంకటగిరి బెటాలియన్ ఆర్‌ఎస్‌ఐ కోటేశ్వరరావు ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. కోటేశ్వరరావు, కుటుంబసభ్యులతో కలిసి రెండు రోజుల కిందట నెల్లూరుకు వెళ్లారు. తిరిగి సోమవారం సాయంత్రం ఇంటి వచ్చే సరికే తలుపుల తాళాలు పగులగొట్టి ఉంది. బీరువాలోని 52 గ్రాముల బంగారు నగలు అపహరించినట్లు గుర్తించారు.. ఈ మేరకు బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

చిల్లకూరు : మండలంలోని వరగలి గ్రామంలో అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న వెంకటకృష్ణయ్య అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంచండి


ఈస్ట్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీతో మాట్లాడుతున్న ఎస్పీ మల్లికా గార్గ్

తిరుపతి క్రైమ్: అనుమానిత వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ తెలిపారు. మంగళవారం ఈస్ట్ పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి డీఎస్పీ సురేందర్ రెడ్డి, సీఐ మహేశ్వర్ రెడ్డితో ఆమె పలు విషయాల గురించి చర్చించారు.

అలాగే జనరల్ డైరీ, కేసు డైరీ కోర్టు క్యాలెండర్ వంటి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ నగరం నడిబొడ్డులో ఉన్న ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో రైల్వేస్టేషన్, బస్టాండ్, టీటీడీ వసతి సముదాయాలు ఇతరత్రా ఉన్నాయన్నారు. ఇలాంటి ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పటిష్టమైన నిఘా ఉంచి, విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. సిబ్బంది కూడా తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

నిరంతరం నిఘా..

అనుమానిత వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్పీ మల్లికాగార్గ్ ఆదేశించారు. తరచూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే రౌడీషీటర్లు, ఆకతాయిలను ప్రత్యేక దృష్టితో చూడాలని తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియపై ఆరా తీసి, పెండింగ్‌లో ఉన్న బైండోవర్లను పూర్తి చేయాలన్నారు. నిరంతరం పరిసర ప్రాంతాల్లోని లాడ్జిలను ముమ్మరంగా తనిఖీలు చేస్తూ కొత్త వ్యక్తులపై అనుమానం వస్తే స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ భాస్కర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి ఆవిర్భావ వేడుకలపై సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి(అలిపిరి): తిరుపతి ఆవిర్భావ వేడుకలను ఫిబ్రవరి 24న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేయాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీవారి పాదపీఠ నగరంగా వెలసిన మన తిరుపతి జన్మదినాన్ని అంతా కలసి వైభవంగా జరుపుకోవాలన్నారు. సౌమ్య నామ సంవత్సరం, ఫాల్గుణ పౌర్ణమి, ఉత్తరా నక్షత్ర సోమవారం 1130 ఫిబ్రవరి 24వ తేదీన తిరుపతి నగరం ఆవిర్భవించిందని తెలిపారు. భగవద్ రామానుజాచార్యుల వారు తిరుపతిలో ఆ రోజున శ్రీ గోవిందరాజస్వామి వారిని ప్రతిష్ఠించి, కైంకర్య నిర్వహణ కార్యక్రమాలు, నాలుగు మాడవీధుల నిర్మాణం ప్రారంభించారన్నారు. తొలుత ×గోవిందరాజ పట్టణంగా×, తరువాత ×రామానుజపురంగా× పిలిచేవారని, 13వ శతాబ్దం ప్రారంభం నుంచి తిరుపతిగా పిలుస్తున్నారని చెప్పారు. తిరుపతి ఆవిర్భావ వేడుకల్లో భాగంగా శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయం నుంచి ఉదయం 8 గంటలకు ఊరేగింపు ప్రారంభమవుతుందని తెలిపారు. ఇందులో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాలల సహకారంతో విభిన్న కళారూపాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, దేవతామూర్తులతోపాటు శ్రీ రామానుజాచార్యుల వేషధారణ ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయం నుంచి ఆంజనేయ స్వామివారి ఆలయం వరకు ఊరేగింపు జరుగుతుందన్నారు. సమావేశంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, ఎఫ్ఏసీఏఓ బాలాజీ, సీఏఓ శేషశైలేంద్ర, చీఫ్ పీఆర్వో రవి, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, రవాణా జీఎం శేషారెడ్డి, డెప్యూటీ ఈఓ శివప్రసాద్, ఎస్వీ సంగీత ప్రిన్సిపల్ డా.ఉమాముద్దుబాల తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా వసతులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీ శ

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందస్తుగానే పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా మౌలిక వసతులు కల్పించినట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయపార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో స్ట్రాంగ్ రూమ్‌లు సిద్ధంగా ఉన్నాయన్నారు. పెండింగ్లో ఉన్న క్లెయిమ్స్, అభ్యంతరాలను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టామని వెల్లడించారు. రాజకీయ పార్టీలకు చెందిన నేతలు ఏజెంట్లను సిద్ధం చేసుకోవాలని, వారి జాబితాను తయారు చేసుకోవాలని కోరారు. ఏజెంట్లకు జిల్లా ఎన్నికల అధికారి నుంచి గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆమేరకు పాఏజెంట్లకు తగు శిక్షణ ఇవ్వాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ పెంచలకిషోర్, ఈఆర్‌ఓలు కోదండరామిరెడ్డి, చంద్రముని, అతిథిసింగ్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

చిల్లకూరు : మండలంలోని కడివేడు గ్రామానికి చెందిన రేణుక అనే మహిళ రెండు రోజులుగా కనిపించడం లేదని కుటుంబీకులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

పేదరిక నిర్మూలనకే 'సంక్షేమం'


మహిళల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : పేదరికం నిర్మూలనకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం 3వ డివిజన్ కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు ఆధ్వర్యంలో మహిళలతో, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో కొత్త సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఎలా స్పీడుగా పనిచేస్తాయో, అదేవిధంగా తనను ఆశీర్వదిస్తే తిరుపతి అభివృద్ధికి కట్టుబడి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఇప్పటికే తాను చేసిన అభివృద్ధి ప్రతిఒక్కరికీ తెలుసునన్నారు. ప్రజలు అవకాశం కల్పిస్తే భవిష్యత్‌లో ఊహించని రీతిలో అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. టీటీడీ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్ఫూర్తితో ప్రజా సేవే పరమావధిగా ముందుకు సాగుతానని తెలిపారు. నగర ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ప్రతి పేదవాడి ముంగిటికే సంక్షేమ ఫలాలు అందించారని వెల్లడించారు. అదే చంద్రబాబు పాలనలో సంక్షేమ పథకాల విషయం దేవుడెరుగు పెన్షన్ తీసుకోవాలంటే రోజుల కొద్దీ ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీసులు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. అలాంటి చంద్రబాబును గెలిపిస్తే తినే అన్నంలో మన్ను పోసుకున్నట్లే అని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలు, కులాల పేరు చెప్పుకునే నాయకులను నమ్మవద్దని సూచించారు. నగరానికి, ప్రజలకు మేలు జరిగి ఉంటేనే వైఎస్సార్‌సీపీ ఓటేయాలని కోరారు. సమావేశాల్లో కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌కే బాబు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు నల్లాని బాబు, పార్టీ నాయకులు శశి, రాపూరి ప్రసాద్, శెట్టిపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

జగనన్న వెంటే జనం


మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సునామీ తథ్యమని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురం, శ్రీనివాసపురం, సాయినగర్, కూపుచంద్రపేట, వేదాంతపురం పంచాయతీల్లో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా సచివాలయాల్లో సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం, ప్రతి గ్రామం, ప్రతి ఇంట్లో ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల వెలుగులు కనిపిస్తున్నాయన్నారు. రోజురోజుకూ జగనన్నకు ప్రజా మద్దతు పెరుగుతోందని, అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభ ద్వారా ఆ విషయం స్పష్టం తెలుస్తోందని వివరించారు. 57 నెలల పాటు నిర్విరామంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగనన్నకు మాత్రమే దక్కుతుందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల భవిష్యత్‌ను మరింత గొప్పగా తీర్చిదిద్దే పాలన కోసం మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చంద్రగిరి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వేసిన సంక్షేమ బాటలో పయనిస్తూ ప్రజా సేవే పరమావధిగా కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న వైఎస్సార్ ఆరోగ్య సురక్ష, రూ.25 వేల విలువైన పెళ్లి కానుకలను చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముందుగానే ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. అలాగే యువతకు క్రీడా పోటీలు, జాబ్ మేళాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి పల్లె ప్రగతి పథంలో పయనిస్తోందని చెప్పారు. నిస్వార్థంగా ప్రజలకు సేవ చేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని చూసి నేర్చుకున్నట్లు తెలిపారు. అనంతరం ఐదు పంచాయతీల్లో రూ.45.38 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేముల యశోద, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి పాల్గొన్నారు.